క్లుప్తంగా

స్కూల్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా

అగనంపూడి: ఈనెల 28, 29 తేదీల్లో అనకాపల్లిలో జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన స్కూల్ కంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు వాయిదా వేసినట్టు పరవాడ మండల విద్యాశాఖాధికారి గొంతిన సాయిశైలజ, ఎస్టీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. 28, 29 తేదీల్లో నిర్వహించాల్సిన సబ్జెక్టు, వ్యాయామ అక్షరాస్యతకు సంబంధించి కాంప్లెక్స్ సమావేశాలు 30,31 తేదీల్లో నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేసిన క్రమంలో వాయిదా వేస్తున్నట్టు వారు తెలిపారు. 28,29 తేదీల్లో భాషోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించాల్సి ఉన్నందున వాయిదా వేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

గాజువాకలో భారీ ర్యాలీ



తరలివెళ్తున్న మార్కండేయ యువజన సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలో నిర్వహించిన చేనేత మహా సభకు 69వ వార్డు తుంగ్లాంకు చెందిన శ్రీ మార్కండేయ యువజన సేవా సంఘం నుంచి సుమారు 350 మంది మహిళలు, పురుషులు తమ సంఘీభావం తెలుపుతూ భారీ ర్యాలీ చేపట్టారు. ఆదివారం వీరు చేనేత భవనం నుంచి గాజువాక సభకు తరలివెళ్లారు. ర్యాలీని సేవా సంఘం అధ్యక్షుడు నావాన సింహాచలం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కొల్లి కుంచారావు, గిడితూరి అప్పారావు, జి.త్రినాథ్, కె.అప్పారావు, ఎం.పెంటయ్య, ఎన్.సత్యవతి, ఎస్.మరుధ్వతి, జి.లీల, జి.ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

పెదగంట్యాడ: చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులంతా కలసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సమావేశాల ద్వారా కార్మికుల ఐక్యత చాటాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 చేనేత కులాలకు చెందిన వారితో పాటు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు పాల్గొన్నారు.

పదవులకు వన్నె తెచ్చారు



నాగేశ్వరరావుతోపాటు బదిలీపై వెళ్లిన పీఆర్‌టీయూ కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి: వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూ, మరో పక్క చేపట్టే పదవులకు వన్నె తెచ్చే ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు అన్నారు. ఎస్టీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఎం.వి.నాగేశ్వరరావు, బదిలీపై వెళ్లిన పరవాడ మండల కమిటీ పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరరావు, పార్థసారథి, అసోసియేటెడ్ అధ్యక్షుడు బి.గణేష్‌లను లంకెలపాలెం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ వృత్తి, ప్రవృత్తిలకు న్యాయం చేసిన ఉద్యోగి అందరి మన్ననలు అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, నాయకులు శ్రీరామూర్తి, చిన్నమ్ములు, జానకీదేవి, పండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

క్రీడాపోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్చర్ ఫౌండేషన్, విశాఖ సౌత్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలురకు కబడ్డీ, వాలీబాల్, బాలికలకు కబడ్డీ, త్రోబాల్ పోటీలు, బాల బాలికలకు 200 మీటర్ల పరుగు పందెం పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాంతానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవడానికి క్రీడలు మంచి సాధనమని అన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో గాజువాక, విశాఖ వెస్ట్, పరవాడ, అనకాపల్లి ప్రాంతాలనుంచి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొంటున్నట్టు నిర్వాహకుడు పేర్ల అప్పారావు తెలిపారు. విజేతలకు ఈనెల 29న బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 67వ వార్డు కార్పొరేటర పల్లా శ్రీనివాసరావు, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి, స్థానిక నాయకులు పల్లా చినతల్లి, చిక్కా సత్యనారాయణ, నిర్వాహకులు ఉమా మహేశ్వరరెడ్డి, గోకా దాసుబాబు, గిరి చరణ్ నాయుడు, శివ ప్రసాద్, పల్లేటి తాతారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి

పెదగంట్యాడ: ఏపీఐఐసీతో ముడిపడి ఉన్న దాసరి వీధి, దల్లివీధిలోని డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు ఏపీఐఐసీ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన జయరామ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించారు. అలాగే సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వర్షాకాలంలో కండిపిల్లి వారి వీధి ముంపునకు గురవుతోందని వివరించారు. అలాగే ఏపీఐఐసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి(రఘు)ను కూడా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి అప్పారావు, సంపంగి సూరిబాబు, ముసిరి శ్రీనివాసరావు, పెద్దాడ సోమునాయుడు, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ కమిషనర్ జయరామ్‌ను సత్కరిస్తున్న పులి వెంకటరమణారెడ్డి తదితరులు

వేడుకగా దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన



మహా శివలింగ ప్రతిష్టాపనలో పాల్గొన్న జీవీఎల్ నర్సింహారావు తదితరులు

గాజువాక : జీవీఎంసీ 71వ వార్డు వడ్లపూడి రైల్వే క్వార్టర్స్‌లోని శివాలయంలో మహా శివలింగం, వారాహి, పార్వతిదేవి, గణపతి విగ్రహాలు, కలస ప్రతిష్టాపన ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు దంపతులు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతులు దేవతామూర్తులకు తొలిపూజ నిర్వహించారు. ఆలయాల విలువను అందరికీ తెలియజేయాలన్నదే బీజేపీ ఉద్దేశమని ఎంపీ నర్సింహారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు దలాయ్, రమణారావు, అప్పారావు, వెంకటరావు, సాంబమూర్తి, శ్రీరామ్మూర్తి, రోహిణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి మహోత్సవం



సత్తెమ్మను దర్శించుకుంటున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక : కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి పండుగ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునుంచే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం అమ్మవారి ఘటాలను భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కలిసి పురవీధుల్లో ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, 76, 64వ వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు దొడ్డి రమణ, ధర్మాల శ్రీను అమ్మవారిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ పర్యవేక్షకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు మద్దాల అప్పారావు, సూరిశెట్టి శివ, భీశెట్టి సింహాచలం నాయుడు, హరినాథ్, నర్సింగరావు, కణికంత, కోటి, సత్యనారాయణ, నాగిశెట్టి శ్రీను, గూన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు రక్షణేదీ?

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ నిర్వాహకుల నిర్లక్ష్యం



దువ్వాడ రైల్వే పార్కింగ్‌లో తడుస్తున్న ద్విచక్రవాహనాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ ఫీజులు రెట్టింపు చేస్తున్నారు. అయితే వాహనాల భద్రత మాత్రం పట్టించుకోవడం లేదు. రైల్వేస్టేషన్ ద్వారా ఏటా 28 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మరోపక్క భువనేశ్వర్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, స్పెషల్ రైళ్లకు విశాఖకు వెళ్లకుండా దువ్వాడ మీదుగా మళ్లిస్తున్నారు. దీంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు తాకిడి రెట్టింపు అవుతోంది. ఈక్రమంలో వసతులు పెంచుతున్నా, వాహనాల పార్కింగ్ ప్రదేశంలో మాత్రం పట్టించుకోవడం లేదు.

గాజువాక, స్టీల్‌ప్లాంట్, పెదగంట్యాడ, పరవాడ, ఎన్టీపీసీ, కూర్మన్నపాలెం ప్రాంతాల నుంచి ప్రయాణికులు ద్విచక్రవాహనాలపై దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకొని వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. విజయవాడ వైపు నిత్యం ప్రయాణం చేసే వందలాది మంది డైలీ పాసింజర్లు ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు వాహనాలను పార్క్ చేస్తున్నారు. రోజుకు రూ.36 వసూలు చేస్తున్న పార్కింగ్ నిర్వాహకులు వాహనాలకు కనీసం నీడ కల్పించడం లేదు. ఎండకుఎండి..వానకు వాహనాలు తడిసిపోయతున్నాయి. రైల్వే అధికారులు అమృత్ భారత్ పునరాభివృద్ధి కార్యక్రమంలోనైనా పార్కింగ్ కోసం షెడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాహనాలను పట్టించుకోకపోతే ఎలా ?

ఏటా వాహన పార్కింగ్ ఫీజును రెట్టింపు చేస్తున్నారు. వాహనాలకు కనీస రక్షణ లేకుండా డబ్బులు వసూలు చేస్తున్నారు. పార్కింగ్ షెడ్లు కూడా నిర్మంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి పార్కింగ్ సమస్య పరిష్కరించాలి.

– వాడచపల్లి రామచంద్రరాజు, కూర్మన్నపాలెం

షెడ్డు నిర్మించాలి

పార్కింగ్ షెడ్లు నిర్మించే వరకు వాహనాలకు డబ్బులకు తీసుకోకూడదు. నిర్వాహకులు ఎడాపెడా పార్కింగ్ ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయి. వాహనాలు కనీస రక్షణ లేదు. నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి.

– గౌతమ్, గాజువాక

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అప్పారావుకు గోల్డ్ మెడల్



బంగారు పతకం అందుకుంటున్న అండిబోయిన అప్పారావు

ఉక్కునగరం: జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ బ్లాస్టఫర్నేస్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ అండిబోయిన అప్పారావుకు గోల్డ్ మెడల్ లభించింది. శనివారం చత్తీస్‌ఘడ్‌లో జరిగిన 29వ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెంచ్ ప్రెస్ కేటగిరీలో అప్పారావుకు బంగారు పతకం లభించింది. దీంతో అప్పారావు వరుసనగా మూడుసార్లు బంగారు పతకం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో జాతీయ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యులు రాజ్ మహావీర్, కార్యదర్శి లియో పీటర్ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో జాతీయ రిఫరీ అండిబోయిన లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కణితి రోడ్డు విస్తరణకు మార్కింగ్



జెడ్సీ పర్యవేక్షణలో కణితి రోడ్‌లో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది



మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

గాజువాక : గాజువాకలోని కణితి రోడ్ విస్తరణలో భాగంగా జీవీఎంసీ సిబ్బంది ఆదివారం సర్వే నిర్వహించారు. కొత్త గాజువాకలోని బీసీ రోడ్ నుంచి స్థానిక వంటిల్లు జంక్షన్ వరకు గతంలో చేపట్టిన రోడ్డు నిర్మాణంపై సర్వే నిర్వహించిన అధికారులు విస్తరణ కోసం మార్కింగ్ చేపట్టారు. కొత్త గాజువాక నుంచి వంటిల్లు జంక్షన్ వరకు మొదటి దశలోను, అక్కడ్నుంచి జగ్గు జంక్షన్ వరకు రెండో దశలోను కణితి రోడ్‌ను విస్తరించిన విషయం తెలిసిందే. రోడ్డును విస్తరించి నిర్మించిన తరువాత పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఆక్రమణలు యధాతథమైపోయింది. ప్రస్తుతం ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం పర్యవేక్షణలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రోడ్డులో ఆదివారం సర్వేతోపాటు రోడ్డు కొలతలపై మార్కింగ్ చేశారు. మొదటి దశలో వంటిల్లు జంక్షన్ వరకు, రెండో దశలో జగ్గు జంక్షన్ వరకు రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జెడ్సీ తెలిపారు.

927వ రోజుకు చేరుకున్న ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం : ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ రక్షణకు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 927వ రోజుకు చేరుకున్నాయి. పలువురు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సత్యారావు సేవలు మరువలేం



సత్యారావు దంపతులను సత్కరిస్తున్న మత్స్యకార అసోసియేషన్ ప్రతినిధులు

పెదగంట్యాడ: మత్స్యకారుల అభ్యున్నతికి, స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుదారులకు పేర్ల సత్యారావు అందించిన సేవలు మరువలేమని పలువురు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న పేర్ల సత్యారావు దంపతులను గంగవరంలోని ఉక్కు కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, ఉక్కు డీజీఎం మురళీధర్ హాజరయ్యారు. స్టీల్, నిర్వాసితుల మత్స్యకారుల అసోసియేషన్ అధ్యక్షుడు కొవిరి కోదండరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యరబాల భూలోక, కొవిరి దేముడు, అప్పన్న, పైడిరాజు, ఎరిపిల్లి అమ్మోరు, నాగేశ్వరరావు, నల్లారావు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయంపై హర్షం



కేక్ కట్ చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

అగనంపూడి: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారతీయ కీర్తి పతాక రెపరెపలాడుతోందని ప్రజా సంఘాల నాయకులు మోటూరి రమణ అన్నారు. చంద్రయాన్-3 విజయంతం కావడం, తెలుగు సినీ నటుడు అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడిగా కీర్తి గడించడంపై అగనంపూడిలో సంబరాలు చేశారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. తరువాత ఆయన మాట్లాడుతూ చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో అగ్రదేశాలైన అమెరికా, రష్యా దేశాల సరసన చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.వెంకటరమణ, బి.సత్యనారాయణ, జె.ఈశ్వరరావు, బి.అప్పారావు, బి.సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో దూసుకుపోతున్న యూనియన్లు



మాట్లాడుతున్న బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న జీటీపీ ప్రకాష్



యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) సమావేశంలో మాట్లాడుతున్న భెల్ జేఎస్‌సీ మెంబర్ కృష్ణంరాజు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) విశాఖ యూనిట్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఈ నెల 31న జరగనున్న నేపథ్యంలో బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద ప్రచార సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగిన సమావేశంలో బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ ఐఎన్‌టీయూసీ, సీఐటీయూతో పొత్తుతో సీటు నుంచి అధ్యక్షుడిగా జి.టి.పి.ప్రకాష్, ఇంటక్ నుంచి ఉరుకూటి బాబూరావు ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న వీరు మాట్లాడుతూ ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డి భెల్ యాజమాన్యంతో నేరుగా సమావేశమై కార్మికుల సమస్యలు పరిష్కరించగల సత్తా ఉన్న నాయకుడన్నారు. ఉదయించే సూర్యుడు గుర్తుపై ఓటు వేసి తమ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప మాట్లాడుతూ బీహెచ్‌పీవీను భెల్‌లో విలీనం చేసిన ఘనత స్వర్గీయ డాక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డికే చెందుతుందన్నారు. అనాడు వేసిన విత్తనం వల్ల ఈ రోజు వాటి ఫలాలను అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీటు నాయకుడు ఎస్.జ్యోతీశ్వరరావు, ఇంటక్ జిల్లా నాయకుడు బి.నాగభూషణరావు, నీరుకొండ రామాచంద్రరావు, ఏఐసీటీయూ నాయకుడు పట్నాయక్, నవీన్ కుమార్, వి.ఆనందరావు, వై.కృష్ణారావు పాల్గొన్నారు.

యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) ప్రచారం

మింది గుడివాడ అప్పన్నకల్యాణ మండపంలో యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) ప్రచార సమావేశం నిర్వహించారు. మజ్దూర్ సంఘ్ నుంచి అధ్యక్షుడిగా బొండ బాబూరావు, టీఎన్‌టీయూసీ నుంచి ప్రధాన కార్యదర్శిగా సుభాకర్ సాహూ పోటీ చేస్తున్నారు. ప్రచార సమావేశంలో భెల్ జేఎస్‌సీ మెంబర్ ఎస్.డి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో కార్మికుల సమస్యలు తీర్చడంతో తాము ఎంతో కీలకంగా వ్యవహరించామన్నారు. సింహం గుర్తుకు ఓటు వేసి తమ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.వి.ఎన్.రాజు, కొల్లి దేముడు, సీహెచ్.ఎస్.ఎన్.రాజు, ఏ.వెంకటేశ్వరరావు, రాము నాయుడు, ధనరాజ్, ఆర్.అప్పారావు, టి.ఎల్.నర్సింగరావు, జె.రాము, ఎస్.ఎల్.నర్సింహులు, ఎ.వెంకటరావు, హెచ్.భోగేష్, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ పరవాడ మండల కమిటీ ఎన్నిక

అగనంపూడి: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) పరవాడ మండల నూతన కమిటీ ఎన్నికైంది. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో అధ్యక్షుడిగా కోవెల రవి, ప్రధాన కార్యదర్శిగా బాబూరావు, మహిళా కార్యదర్శిగా సీహెచ్.శ్రీలతతోపాటు ఇతర కమిటీ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, అసోసియేటెడ్ అధ్యక్షుడు కె.విశ్వేశ్వరరావులు వ్యవహరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం : విద్యుత్ షాక్‌కు గురై వడ్లపూడి లక్ష్మీపురం కాలనీకి చెందిన జాజుల రాము (38) ప్లంబింగ్ కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌సీ కాలనీలో ఓ భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం విధులకు వెళ్లాడు. ప్లంబింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా సాయంత్రం రాము మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.